క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నెల్లూరు (టౌన్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఖాదీ ఫర్ నేషన్ - ఖాదీ ఫర్ ఫ్యాషన్‌లో భాగంగా స్థానిక పొదలకూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాలలో పలు మండలాల నుంచి వచ్చిన విద్యార్థులకు పలు అంశాల్లో మంగళవారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. వ్యాచరచన పోటీలో తెలుగు భాషలో వావిళ్ల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన శ్రీవిద్య, హిందీ భాషలో అల్లూరు ఎంజేపీఏపీ ఆర్ పాఠశాలకు చెందిన సింధు, ఇంగ్లిష్ భాషలో అల్లూరు ఎంజేపీఆర్ పాఠశాలకు చెందిన మహిత ప్రథమ స్థానాలు సాధించారు. వక్తృత్వ పోటీల్లో తెలుగులో అల్లూరిపేట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సాయిశరణ్య, ఇంగ్లిష్‌లో అల్లూరు ఎంజేపీఆర్ పాఠశాలకు చెందిన శ్రీదివ్య, హిందీలో దర్గామిట్టలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన నాయబ్‌రసూల్ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, డీసీఈబీ సెక్రటరీ రామ్‌కుమార్, ఎంఈఓలు హమీద్, మురళీ, హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

- డీఈఈ మధుసూదన్‌రెడ్డి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విధి నిర్వహణలో అలసత్వం, వినియోగదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి విద్యుత్ సిబ్బందిని హెచ్చరించారు. నగరంలోని వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీల్లో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎఫ్ క్లాస్-డీ లిస్ట్(మూడు నెలల నుంచి బిల్లులు చెల్లించని సర్వీసులు)పై తనిఖీలు చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ప్రథమ కర్తవ్యంగా భావించాలని సిబ్బందికి సూచించారు.

ధూమపానంతో సీఓపీడీ



డాక్టర్ గౌరీనాథ్

నెల్లూరు సిటీ: ధూమపానంతో 90శాతం మంది సీఓపీడీ అనే శ్వాస సంబంధిత వ్యాధి బారిన పడుతున్నారని ఎనెల్ హాస్పిటల్ పల్మనాలజిస్ట్ గౌరీనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఓపీడీ కారణంగా నెలలు తరబడి ఆయాసం, దగ్గు, ఊపిరి వదిలితే పిల్లికూతలు వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఈ నెల 15న వరల్డ్ సీఓపీడీ డే సందర్భంగా తమ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు.వ్యాధి నిర్ధారణకు పీఎఫ్‌టీ టెస్ట్, ఛాతి ఎక్సరే , రక్తపరీక్షలను కేవలం రూ.700కే అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

వైభవంగా గోవర్ధన పూజ



నెల్లూరు(బృందావనం) : నగరంలోని ఇస్కాన్ మందిరంలో గోవర్ధన పూజను మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో తొలుత గోమాతలకు పూజలు నిర్వహించారు. అనంతరం మందిరంలో బలరామ, శ్రీకృష్ణసుభద్రలు విశేషాలంకారంలో కొలువుదీరారు. భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శివదీక్ష వస్త్రాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో పవిత్ర కార్తీక మాసంలో శివదీక్ష చేపడుతున్న భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఉచితంగా దీక్ష వస్త్రాలను పంపిణీ చేశారు. రాపూరు పెనుశిలశ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, మూలస్థానేశ్వరస్వామి ఆలయ ఈఓ ఆరంబాకం వేణుగోపాల్ చేతుల మీదుగా భక్తులకు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తొలి రోజు సుమారు 500మందికిపైగా భక్తులకు వస్త్రాలను అందజేశామని చెప్పారు. మరో 500మందికి వస్త్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్‌జీ భాస్కరరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటశేషారెడ్డి, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

- నెల్లూరు ఆర్డీఓ మలోలా
- ఘనంగా బాలల దినోత్సవం



కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపిస్తున్న నెల్లూరకు ఆర్డీఓ మలోలా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మనిషి భవిష్యత్తు, జీవితాన్ని చదువు మార్చేస్తుందని, విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని నెల్లూరు ఆర్డీఓ మలోలా అన్నారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్కులో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి బాలలు, వాకర్స్ రోజా పూలతో ఘనంగా నివాళులర్పించారు. నవరస కూచిపూడి నాట్య కళాక్షేత్రం విద్యార్థుల నృత్య ప్రదర్శన, చిల్డ్రన్స్‌పార్క్ కరాటే ఇన్‌స్టిట్యూట్ చిన్నారుల కరాటే విన్యాసాలు, దేశభక్తి గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు ఆర్డీఓ మలోల ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి చిన్నారులు పంచిపెట్టారు. అనంతరం కరాటే, నృత్య పోటీల విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్న నెహ్రూ సిద్ధాంతంతో ఏకీభవించి, దేశానికి మంచి పౌరులను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం చదువు మీద ఓ చక్కటి పాటను పాడి విద్యార్థులు, వాకర్స్‌ను అలరించారు. చిల్డ్రన్స్ పార్కు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ పాముల రమణయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ సింగంశెట్టి మురళీమోహన్‌రావు, కార్యదర్శి కొట్టే రామ్మూర్తి, పొజర్ల శంకరయ్య, పీ శివ ప్రసాద్‌నాయుడు, కళాంజలి శ్రీనివాస్ చక్రవర్తి, కరాటే గురువు శ్రీనివాస్, కూచిపూడి గురువు గౌరీదివ్యపావని, రాజా రవీంద్ర, గుండు సుబ్రహ్మణ్యం, టీ సురేష్‌బాబు, పీ వాసుబాబు, శ్రీనివాసులురెడ్డి, జీవీ ప్రసాద్, వై రవి, రాజశేఖర్‌నాయుడు, రాములు, పార్థసారథిరెడ్డి, టీ సత్యనారాయణ, అడ్వొకేట్ వెంకటేశ్వర్లు, రాము, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాయపాళెం దళితవాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవాణాశాఖ ఎంవీఐ మురళీమోహన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చదువే ఆయుధంగా విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం దివ్యాంగ విద్యార్థి అజేయ్‌బాబుకు రూ.1100 నగదు బహుమతి అందజేశారు. చదువు, ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు హరీష్, యోగా టీచర్ సహజానంద పాల్గొన్నారు.

కేఎన్నార్ మున్సిపల్ పాఠశాలలో..

బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఐసీపీఎస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలలకు ప్రధానంగా ఉండే జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులను వివరించారు. ఎన్‌జీఓ శ్రీనివాసులు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థుకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లును అందజేశారు. న్యాయవాది జయలక్ష్మి, హెడ్‌మాస్టర్ విజయప్రకాష్, ఐసీపీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: మద్రాస్ బస్టాండ్ సెంటర్‌లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలోని ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్యూర్ స్మైల్ చారిటీస్ వ్యవస్థాపకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ సంఘమిత్ర సభ్యుల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్పాస్టిక్ సెంటర్ అడ్వైజర్ దాసరి రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్ సెంటర్ కో కన్వీనర్ బలరామయ్యనాయుడు, ప్రిన్సిపల్ గురునాథరావు, తలసేమియా కోకన్వీనర్ పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఉడ్‌డిపో, మెడికవర్ ఆస్పత్రి, చిన్న బాలయ్యనగర్, తదితర ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఆటలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు రమేష్‌బాబు, కార్తికేయ, శశికిరణ్, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని మద్రాసుబస్టాండ్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి నెహ్రూ అందించిన సేవలు, స్వాతంత్య్ర పోరాటంలో ఆయన చూపిన పటిమను కొనియాడారు. పీసీసీ ఉపాధ్యక్షుడు సీవీ శేషారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, కొండా అనిల్, నాయకులు రాజా, చంద్రశేఖర్‌రెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో బాలలకు దేశభక్తి గీతాలు, భగవద్గీత పోటీలు నిర్వహించారు. విజేతలకు అరిగెపూడి విజయకుమార్ సహకారంతో నగదు బహుమతులు, మిఠాయిలు అందజేశారు. నజీర్‌బాషా గురూజీ, పాటూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూకు ఘన నివాళి

నెల్లూరు(బారకాసు): భారతదేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నగరంలోని మద్రాసుబస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మేయర్ స్రవంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశానికి ఎక్కువ కాలం ప్రధాన మంత్రిగా సేవలందించిన నెహ్రూ తనదైన దార్శనికత, ముందుచూపుతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారికి కానుకలు అందజేసి ప్రోత్సహించేవారని తెలిపారు. చిన్నపిల్లలు కూడా పండిట్ నెహ్రూ అంటే గొప్ప అభిమానాన్ని చూపేవారని, అందుకనే చాచా నెహ్రూ అని చిన్నారులంతా పిలిచేవారన్నారు. నెహ్రూ వంటి మహనీయులను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మేయర్ స్రవంతి



కేఎన్నార్ స్కూల్‌లో ఆటల పోటీల విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్ల ప్రదానం



రెడ్‌క్రాస్‌లో చిన్నారులకు బహుమతుల ప్రదానం



నెల్లూరురూరల్: ఇందిరమ్మకాలనీలో...

ఇందిరమ్మకాలనీలో..

నెల్లూరు రూరల్: 24వ డివిజన్ ఇందిరమ్మకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో చాచా నెహ్రూ చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు బాలల దినోత్సవ విశిష్టతను వివరించారు.ఆనంతరం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, జర్నలిస్ట్ నాయకులు జయప్రకాష్, హనోక్, రామ్మూర్తి, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, హెచ్ఎం రాఘవులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సురేష్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అమ్మ యూత్ ఫౌండేషన్ నిర్వాహకులు



కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో..



కొండాయపాళెం పాఠశాలలో దివ్యాంగ విద్యార్థికి నగదు బహుమతి ప్రదానం



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఇరువురు పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



నెల్లూరు(మినీబైపాస్) : నగరంలోని రేబాల వీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ జిల్లా చైర్‌పర్సన్ దొంతు శారద పాల్గొని, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ పుస్తకమే నేస్తం కావాలని, ఆ ఉద్దేశంతోనే గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్సార్ మున్సిపల్ హైస్కూల్ ప్రజా సైన్స్ వేదిక అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్, కార్పొరేటర్ ఎం.కామాక్షిదేవి, గ్రంథాలయ కార్యదర్శి కె.కుమార్‌రాజా, అసిస్టెంట్ పౌర సంబంధాలధికారి రవీంద్ర, లైబ్రేరియన్ సీహెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు



నెల్లూరు (టౌన్): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మూలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి వాణి ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ న్యాయసేవలపై అవగాహన కల్పించారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, దివ్యాంగులైన వ్యక్తులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పార్థసారథి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు



వెండినందిసేవలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి

నెల్లూరు(బృందావనం): నగరంలోని శైవక్షేత్రాల్లో కార్తీక మాస శోభ నెలకొంది. హరిహరాదులకు ప్రీతికరమైన పవిత్ర కార్తీకమాసం మంగళవారం ఆరంభం కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చారు. శివపార్వతులను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపకాంతుల్లో పార్వతీపరమేశ్వరుల కొలువులు కొత్తశోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా శైవక్షేత్రాల్లో విశేషాభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయంగా ఆకాశదీపాలు వెలిగించారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం

మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి ఆకాశ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అఖండ దీపారాధన, వెండి నంది సేవను కనుల పండువగా నిర్వహించారు. తొలుత నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశదీపాన్ని వెలిగించారు. అనంతరం వెండి నంది సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆకాశదీపాన్ని వెలిగించే భాగ్యాన్ని గత పదేళ్లుగా ఆ పరమేశ్వరుడు తనకు కల్పించడం సంతోషకరమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నగర ప్రజలకు ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలని పరమేశ్వరుడిని కోరుకున్నట్లు తెలిపారు. గత 11 ఏళ్లుగా ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు శివమాల ధరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పరమేశ్వరుడిపై భక్తితో నిర్వహిస్తున్న ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు అంతా మంచి జరగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నామన్నారు. జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు చాట్లనరసింహారావు, నాయకులు మానికల సునీల్, మల్లి నిర్మల, నూనె ప్రసాద్, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.



ఆకాశదీపం వెలిగిస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ఘనంగా నెహ్రూ యువకేంద్రం ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు(దర్గామిట్ట):నెహ్రూ యువకేంద్రం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రాన్ని 1972 నవంబర్ 14న ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాలు, 633 జిల్లాల్లో నెహ్రూ యువకేంద్రం కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. యువకేంద్రం లక్ష్యాలను వివరించారు. ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి నాగసాయి సూరి, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, జయప్రకాష్, వెంకటేశ్వర్లు, గీత పాల్గొన్నారు.

26న మహాకార్తీక దీపోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ వెన్నెల

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 26న సింహపురి కార్తీకదీపోత్సవ సమితి ఆధ్వర్యంలో నెల్లూరు చెరువులోని గణేష్ ఘాట్ వద్ద మహాకార్తీక దీపోత్సవాన్ని విశేషంగా నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కే వెన్నెల పేర్కొన్నారు. రామమూర్తి నగర్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో మహాకార్తీక దీపోత్సవ నిర్వహణపై కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింహపురి మహిళల ఐక్యతకు మహాకార్తీక దీపోత్సవం దర్పణంగా నిలవనుందన్నారు. నగరంలోని ప్రతి గృహం నుంచి మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సింహపురిలోని ప్రతి మహిళ తన వంతు భూమిక పోషించి పరమేశ్వరుడి కృపకుపాత్రులుకావాలన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లిక మాట్లాడుతూ గో పూజతో మహాకార్తీక దీపోత్సవం ప్రారంభమవుతుందన్నారు. తాత్కాలిక మహాశివలింగ ప్రతిష్ట, గణపతి హోమం, రుద్ర హోమం, శివపార్వతులు, శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి విశేషపూజలు, కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఉసిరి వృక్షం కింద 108దీపాలతో ఆరాధన

కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలోని ఉసిరి వృక్షం కింద మహిళభక్తుల ఆధ్వర్యంలో 108 దీపాలతో దీపారాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కే రాజేశ్వరి, కోడూరు జయప్రద, కార్పొరేటర్ కామాక్షి, గౌరవ సలహాదారులు శ్రీకంఠం రమణయ్య, ముక్కాల వ్యాసప్రసాద్, కోడూరు జయరామ్, రమేష్ ఆచారి, ఏవీఆర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను కట్టడి చేయాలి



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, పోలీసులు

నెల్లూరు రూరల్ : బాల్య వివాహాల కట్టడికి ప్రతిఒక్కరూ సహకరించాల్సిందిగా పోలీసు సిబ్బంది పిలుపునిచ్చారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో రూరల్ మండలంలోని ఆమంచర్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాల్య వివాహలతో కలిగే అనర్థాలను వివరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో చట్టాల గురించి తెలియజేశారు.

మధుమేహంపై అవగాహన అవసరం



సూచనలు చేస్తున్న మధుమేహ నిపుణుడు

నెల్లూరు రూరల్ : మధుమేహం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మధుమేహ నిపుణుడు అచ్యుత్ అన్నారు. బుజబుజనెల్లూరులోని పీఎంపీ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షుగర్ వ్యాధి పట్ల ఎంతో అప్రమత్తత అవసరమని, ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, వైద్యుడు కల్యాణ్, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పలువురు అసోసియేషన్ నాయకులు,స్థానిక నాయకులు పాల్గోన్నారు.

నేడు, రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 16,17 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ఏ టూ జెడ్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్, ఎల్ఐసీ ఇండియా, పాపులర్ షూమార్ట్ కంపెనీల్లోని టెలీకాలర్స్, ఫీల్డ్ ఎగ్జిక్యూటీవ్స్, క్వాలిటీ కంట్రోలర్, బ్రాంచ్ రిలేషన్ ఎగ్జిక్యూటీవ్స్, హౌస్ కీపింగ్, మెషిన్ ఆపరేటర్స్, ఏజెంట్, సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 16,17 తేదీల్లో ఉదయం 10.30 గంటలకు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.